గొప్ప సందర్భం రావచ్చు. కానీ ఏ రూపంలో? వెండి బంగారు మూటలు, నోట్లకట్టలతో నిండిన బ్యాగులెవరైనా పారేసుకుంటారంటే ఆమె నమ్మదు. డబ్బు విషయంలో మనుషులు అంత నిర్లక్ష్యంగా ఉంటారన్న అత్యాశకు పోదు. కానీ, ఎప్పుడో ఒక్కక్షణం అనిపిస్తుంది. ఏమో.. ఎవరూ ఊహించని అద్భుతం జరగొచ్చు. అప్పుడు దశ తిరిగి పోతుంది. తనూ, తన కుటుంబమూ సంపన్నుల్లో చేరుతారు. డబ్బులున్న వాళ్లయి పోతారు. ఏదీ అసాధ్యం అనుకోవడానికి లేదు.

బతుకైనా అదృష్టమైనా చిత్రమైంది. కనికరిస్తే అది దేవత. తప్పించుకుని తిరిగితే దయ్యం.

ఆమె చిన్న ప్రపంచంలో ఎన్నెన్నో కలలు. అవి ఆకాశమంత విశాలం, చెత్తకుప్పలంత విస్తారం.

తెల్లవారి ఏడు గంటలు దాటిపోయింది..

మబ్బుల నడుమ లేత సూర్యుడు తప్పటడుగులు వేస్తున్న పిల్లాడిలా హుషారుగా ఉన్నాడు. ఎండ కొద్దికొద్దిగా వేడెక్కుతూ చలిని తరిమేస్తోంది. కడుపు ఉబ్బిపోయి బరువెక్కిన సంచీ రాజమ్మ భుజం మీద భారంగా ఊగుతోంది.

ఆమె బాగా అలసిపోయింది. నిజానికి ఆరోజు ఎక్కువే తిరిగింది. సంచీ నిండినమాట నిజమే, కానీ అందులో రాబడి ఎక్కువగా వొచ్చే వస్తువులేవీ లేవన్న సంగతి ఆమెకు గ్రహింపు ఉంది. రాజమ్మ తనకు చెత్త కుప్పల్లో దొరికిన ప్రతి వస్తువూ అమ్మకాని కోసమనే భావిస్తుంది. అది తప్ప ఇంకో యోచన రాదు. దాచుకోవడం, వాడుకోవడం వంటివి తెలియవు.

లేనోడు దేన్నయినా అమ్ముకునేందుకు సిద్ధపడతాడు. ఉన్నోడు ఎంత విలువైనదైనా కొనడానికి రెడీగా ఉంటాడు. ప్రతిదీ అమ్మకానికో, కొనుగోలుకో పనికొచ్చే వ్యావహారిక వ్యవస్థలో బతుకుతున్నామనే నిజాన్ని చెత్తవృత్తి పాఠాలు నేర్పుతూ వొచ్చింది. పదిలంగా దాచుకునే వస్తువేదీ చెత్తకుప్పల్లో ఉండదని రాజమ్మ నమ్మకం.

అంతేకాదు, దొరికిన వస్తువు విలువైనదా కాదా అనే తేడాలు కూడా ఆమె దృష్టిలో లేవు. దొరికిందల్లా సంచిలో వేస్తుంది. వాటిలో కొన్ని వస్తువులు ఎందుకూ పనికిరానివి కూడా ఉంటయి. వాటిని కొనేందుకు సేఠ్ ఒప్పుకోడు. అవెంత బరువైనవైనా తీసి పడేస్తాడు.

చెత్తలో దొరికే పనికిరాని వస్తువేదైనా రీసైక్లింగ్ జరగాల్సిందే. వాటిని కరిగించి తిరిగి కొత్త వస్తువుల్ని తయారు చేస్తారన్న సంగతి రాజమ్మ వినివుంది. ప్రస్తుతం పగిలిన, విరిగిన, పాడైపోయి ఉన్నవన్నీ తర్వాత మరో రూపాన్ని పొందేవే.

రాజమ్మ చూపు సైతం చిత్రంగా ఈ నేపథ్యం లోంచే ఉంటుంది. సంపూర్ణమైన వస్తువులేవీ ఆమె చూపులకు ఆనవు. చూసినా పట్టించుకోదు. అలాంటివి తనకు అస్సలు పనికిరావు. ఏం చేసుకుంటుంది? తీసుకపోయి ఇంట్లోనో, మ్యూజియంలోనో పెట్టలేదు.

ఆమె కళ్లు చెత్త వస్తువుల్ని చూసేందుకే అలవాటు పడ్డయి. శిథిలాలు, ముక్కలు, పనికిరాని వాటికే చూపులు అతుక్కపోతయి.

చెత్తలో దొరికేది ఏదైనా అమ్మకానికి పనికొస్తుందా, డీలర్ కొంటాడా అన్నదే గమనిస్తుంది.

కాసిన్ని డబ్బులు కూడా ఇవ్వలేనివి కండ్లబడ్డా పట్టించుకోదు. వొదిలేసి ముందుకు పోతుంది. పాడైపోయిన తుక్కులు, ముక్కలే ఆమెకు విలువైనవి. ఆమె దృష్టిలో అవి పూర్తికాని చిత్రాలు. కరిగించి రీసైక్లింగ్ చేస్తే కొత్త చిత్రాలవుతయి. వాటికి పునః ప్రతిష్ఠ జరుగుతుంది.

ఉదయం ఎనిమిది గంటలు దాటింది..

ఎన్నోచోట్ల తిరిగి తిరిగి చివరగా డంప్ యార్డుకు చేరుకుంది రాజమ్మ. ఆ రోజుకి అదే ఆఖరి మజిలీ. అక్కణ్నుంచి నేరుగా డీలర్ దగ్గరకు పోవడమే. పనికొస్తాయనుకున్న వాటిని తూకమేసి పైసలిస్తడు సేఠ్. ఆ పైసలు తీసుకొని కొంపకు పోతుంది.

డంప్ యార్డ్ భయం గొలిపేలా ఉంది. ఏవో రెండు రాజ్యాల మధ్య భీకర యుద్ధం జరిగినట్టుంది పరిస్థితి. ఎటుచూసినా చెత్తకుప్పలు. నరకాన్ని మోసుకొచ్చే గాలి. భరించలేని దుర్గంధం. ముక్కుపుటాలు అదిరి కొత్తోళ్లయితే అక్కణ్నుంచి పారిపోతరు. బాల్యం నుంచి మురికి, దుర్గంధంలోనే గడిపిన రాజమ్మకు పెద్ద ఫరక్ పడలేదు.

కొన్నిచోట్ల చెత్తకుప్పలు చిన్నచిన్న కొండల్లా పెరిగిపోయి ఉన్నయి. రాబందుల్ని తలపిస్తూ ఊరకుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నయి. గార్బేజ్ ట్రక్కు ఒకటి అప్పుడే చెత్త డంప్ చేసి వెళ్లింది.

రాజమ్మ అటు నడిచింది. సంచీ పక్కన పడేసి వొంగి చెత్తలో వెతకసాగింది.

తడితడిగా.. చీదరగా.. రకరకాల దుర్గంధాలు కలగలిసి ఊపిరాడనట్టుంది. తడిచెత్త పొడిచెత్త వేరుచేయాలని మున్సిపాలిటీ చెపుతుంది. కానీ ఎవరూ పట్టించుకోరు. సబ్బండ రకాల చెత్తంతా ఒకేచోట.

చెల్లాచెదురుగా పడున్న పెద్దపెద్ద క్యారీ బ్యాగు మూటల్ని ఒక్కొక్కటీ విప్పి చూస్తోంది. బ్యాగుల్లోపలికి చేయిపెట్టి ఒక్కొక్కటీ బయటికి లాగుతుంది. ఒక పెద్ద నల్లరంగు ప్లాస్టిక్ బ్యాగు విప్పింది. లోపల బాగా తడిసిన చెత్త కుక్కినట్టుంది.

చేతికి ఏదో మెత్తగా తడిగా జిగటగా అంటుకుంది. దాన్ని బయటికి తీసింది. తట్టుకోలేనంత దుర్వాసన, రక్తంతో కూడిన నీచువాసన ఒక్కసారి గుప్పుమంది. అంత మొత్తంలో మాంసాన్ని మూటకట్టి అట్లా ఎందుకు పారేశారో ఆమెకు అర్థంకాలేదు. బహుశా పాడైపోతే పారేసి ఉంటారని అంతవరకే భావించింది.

చేతుల్ని చిత్తు కాగితాలతో తుడుచుకొని మళ్లీ బ్యాగులో చేయిపెట్టి చూసింది. అడుగున నల్లగుడ్డలో చుట్టిన మరో మూట దొరికింది. అది ఇంకొంచెం పెద్దది. విలువైనవి ఏవైనా ఉన్నాయేమోననే ఆశతో బయటికి లాగి విప్పింది.

చూసిన మరుక్షణం భయంతో వణికిపోయింది.

ఆ మూటలో ఓ పసికందు శవం. కొన్ని గంటల వయసున్న రక్తపు గుడ్డు. చచ్చిపోతే అట్లా మూటకట్టి చెత్తబ్యాగులో వేశారో, లేక కావాలని శిశువు ప్రాణాలు చిదిమేసి వదిలించుకున్నారో తెలియదు.

బిత్తరపోయి పెద్దగా అరిచింది రాజమ్మ. ఆమెకు ఊపిరి ఆడలేదు. ఒక్కఉదుటున లేచి నిలబడింది. క్షణం ఏం చెయ్యాలో తోచలేదు. తర్వాత మైకంలోంచి బయటికొచ్చినట్టు రక్తశిశువుకేసి తేరిపార చూసి బాణంలా అక్కణ్నుంచి పరుగుతీసింది. తన సంచీ అక్కడే వదిలేసి ఎటు వెళుతున్నదీ చూడకుండా దూసుకుపోయింది.

నగరంలో తొమ్మిది గంటలకు జనం సందడి మొదలైంది..

ఎంతోదూరం ఆగకుండా పరుగెత్తి అలసిపోయిన రాజమ్మ ఆయాసంతో ఒక దుకాణం మెట్లపైన కూలబడింది. గుండె వేగంగా కొట్టుకుంటుంటే తేరుకునేందుకు చాలాసేపు పట్టింది.

ఎంత పారేసేవైనా అసలు పనికిరాని వస్తువేదీ ఉండదని రాజమ్మ ఇప్పటివరకూ నమ్ముతూ వొచ్చింది. పాత వస్తువు సరికొత్త రూప పరివర్తనకు దోహదం చేస్తుంది. ఏదీ నశించదు, కేవలం రూపం మార్చుకుంటుంది.

పాత ప్లాస్టిక్ నుంచి కొత్త ప్లాస్టిక్ సామాన్లు, చిరిగి పాడైన పాత బ్యాగులేమో వేర్వేరు రూపాల్లో సరికొత్త బ్యాగులు, తుప్పుపట్టిన తుక్కు రేకులు కొత్త డబ్బాలై, పాత లెదరంతా తళతళ మెరిసే చెప్పులు, షూలు తదితర నయా అవతారాలుగా రూపొందుతయి.

పాత బంగారాన్ని కరిగించి జిగేల్మనే సరికొత్త ఆభరణాల్ని తయారుచేస్తారు. చిన్నపిల్లలు పెరిగి పెద్దవారై కొత్త మనుషులుగా, పరిపూర్ణులుగా మారిపోతారు.

అట్లా కొత్తదేదీ స్వతహాగా కొత్తది కాదు. పాతదానితో అనుసంధానం అయ్యే ఉంటుంది.

మరైతే డంప్ యార్డు చెత్తలో కనిపించిన మృతశిశువు..? ఆ పసిగుడ్డు కొత్త వస్తువా? లేక పాత వస్తువా..? ఏమనుకోవాలి?

ఏ రూపాంతరం జరక్కుండానే పాతదిగానే ముగిసింది. కాదు, ముగించేశారు. చెత్తలో కలిపేశారు.

చెత్తను నమ్ముకొని బతికే ఆమెకు సైతం ఉపయోగపడని చెత్తవస్తువు కంటే హీనాతిహీనం చేశారు.

అన్నిటిలా ఆ పసిగుడ్డు దేహానికి రీసైక్లింగ్ లేదు. ఏం చేసినా మరో రూపానికి రాదు. అసలు పరివర్తనే లేదు.

పదిగంటల ఎండ వేడెక్కి చురచురమంటోంది..

రాజమ్మ తలెత్తి మొగులు వైపు చూసింది. పైన సూర్యుడు వెండి కడియంలా మెరిసిపోతున్నాడు. ■


## డాక్టర్ ఎ. సంతోష్ రెడ్డి



డంప్ యార్డులో పడేసే వస్తువులన్నీ రీసైక్లింగ్ అవుతాయి. అలా.. కొత్త వస్తువులన్నీ పాతవాటితో అనుసంధానమయ్యే ఉంటాయి. మరి.. 'చెత్తకుప్పల్లో దొరికే మృతశి శువు? ఆ పసిగుడ్డు కొత్త వస్తువా? లేక పాత వస్తువా? ఏమనుకోవాలి?'.. అంటూ రీసైక్లింగ్ కథ ద్వారా ప్రశ్నిస్తున్నారు డాక్టర్. ఎ. సంతోష్ రెడ్డి. ఈయన స్వస్థలం హైద రాబాద్‌లోని కొత్తపేట్. ప్రస్తుతం వృత్తిరీత్యా న్యూఢిల్లీలో ఉంటున్నారు. ఎంబీబీఎస్, డీఎన్‌బీ (రేడియాలజీ) చేశారు. న్యూఢిల్లీలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో రేడియాలజీ చీఫ్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. సాహిత్య పఠనం పట్ల అభిరుచి పెంచుకున్నారు. 'రీసైక్లింగ్'.. ఈయన మొట్టమొదటి కథ మాత్రమే కాదు, మొట్టమొదటి రచన కూడా! నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీలో.. తన తొలి కథకే బహుమతి రావడం ఎంతో ఆనందంగానూ, ప్రోత్సాహకరంగానూ ఉందని చెబుతున్నారు రచయిత. సాహితీ రచనలో ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని నమ్ముతున్నానని అంటున్నారు.